# ఆదాయ ప్రాప్తిరస్తు!

- షాపింగ్‌మాల్ రంగంలోకి అడుగిడుతున్న మున్సిపాలిటీ
- ప్రారంభానికి సిద్ధమవుతున్న ఇన్‌స్టిట్యూషనల్ భవన సముదాయం
- పెరగనున్న రూ.5 లక్షల అదనపు ఆదాయం
- వైఎస్సార్ సీపీ హయాంలో నాటి మంత్రి విశ్వరూప్ ముందుచూపు ఫలితం


అమలాపురం మెయిన్ రోడ్డు చెంత మున్సిపాలిటీ నిర్మించిన ఇన్‌స్టిట్యూషనల్ భవన సముదాయం (షాపింగ్ మాల్)

**అమలాపురం టౌన్:** అమలాపురం మున్సిపాలిటీ త్వరలో షాపింగ్ మాల్ రంగంలోకి అడుగుపెట్టి అద్దెల రూపంలో రూ.లక్షల ఆదాయం ఆర్జించనుంది. మున్సిపాలిటీకి 55 షాపులతో అతి పెద్ద షాపింగ్ మాల్‌గా పొట్టి శ్రీరాములు షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్) ఉన్నప్పటికీ షాపుల వారీగా లీజుదారులకు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అయితే షాపింగ్ మాల్‌కు అద్దెకు ఇచ్చే నిమిత్తం గ్రౌండ్ ఫ్లోర్ (సెల్లార్)తో కలుపుకుని నాలుగు అంతస్తులతో భారీ భవనాన్ని నిర్మిస్తోంది. త్వరలో ప్రారంభించనున్న ఈ భారీ భవనాన్ని ఏదైనా కార్పొరేట్ సంస్థకు షాపింగ్ మాల్ నిమిత్తం అద్దెకు ఇవ్వనుంది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగానే మెయిన్ రోడ్డు చెంత రూ.3.02 కోట్లతో ఇన్‌స్టిట్యూషనల్ బిల్డింగ్‌ను నిర్మిస్తోంది. ఈ బిల్డింగ్‌ను ఏదైనా కార్పొరేట్ సంస్థ షాపింగ్ మాల్ కోసం అద్దెకు తీసుకుంటే మున్సిపాలిటీకి రూ.5 లక్షల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

ఇప్పటికే పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న 104 షాపుల ద్వారా రూ.1.08 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ షాపింగ్ మాల్ కూడా అందుబాటులోకి వచ్చి అద్దె ఆదాయంలో పడితే ప్రస్తుతం వస్తున్న రూ.1.08 కోట్లకు అదనంగా మరో రూ.5 లక్షల ఆదాయం పెరుగుతుంది. మెయిన్ రోడ్డులో అదీ మున్సిపల్ కార్యాలయం, డీఎస్పీ కార్యాయం, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు బలగాలు ఉండే ప్రదేశాలే కాక ఓ ప్రైవేటు వస్త్రాలయం (షాపింగ్ మాల్) ఉన్న సెంటరులో మున్సిపల్ ఇన్‌స్టిట్యూషనల్ భారీ బిల్డింగ్ నిర్మించడం మున్సిపాలిటీకి కలిసివచ్చే అంశంగా మారనుంది. వ్యాపార పరంగా గిరాకీ ఉన్న ప్రాంతం కావడంతో సంస్థలు ముందుకు వచ్చే అవకాశం పుష్కలంగా ఉంది.

**నాడు మంత్రి విశ్వరూప్ ఆలోచనా ఫలితమే..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే అయిన రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ మున్సిపాలిటీ ఆదాయ వనరులను మరింత పెంచే ముందు చూపుతో ఈ భారీ భవనానికి నిధులు తెచ్చారు. ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ స్మాల్ మీడియం టౌన్స్ (ఐడీఎస్ఎంటీ) ద్వారా రూ.3.02 కోట్ల నిధులను విశ్వరూప్ మంజూరు చేయించి ఈ భవన నిర్మాణానికి కారకుడయ్యారు. 2023లో ఈ ఇన్‌స్టిట్యూషనల్ బిల్డింగ్‌కు ఆయనే శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నిర్మాణ దశలో ఉన్న ఈ బిల్డింగ్‌కు నాలుగు అంతస్తుల స్లాబ్‌తో పాటు దాదాపు నిర్మాణాత్మక పనులన్నీ పూర్తయ్యాయి. త్వరలో ఈ భవనం ప్రారంభమై మున్సిపాలిటీకి ఓ షాపింగ్ మాల్ సొంతం కానుంది.

**95 శాతం పనులు పూర్తి**

ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్ నిర్మాణం దాదాపు 95 శాతం పూర్తయింది. మిగిలిన అయిదు శాతం పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. రెండు లేదా మూడు నెలల వ్యవధిలో భవనాన్ని ప్రారంభించే అవకాశం ఉంది.
వెంకటేష్, మున్సిపల్ ఏఈ, అమలాపురం

## కుట్టుమి పాలనలో చేనేత కార్మికులకు అన్యాయం

వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జగదీష్ చంద్ర గణేష్


జగదీష్ చంద్ర గణేష్

**అమలాపురం రూరల్:** కూటమి ప్రభుత్వం బూటకపు హామీలు ఇచ్చి చేనేత కార్మికులను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జాన జగదీష్ చంద్ర గణేష్ విమర్శించారు. అమలాపురం రూరల్ మండలం బండారులంకలో శనివారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కార్మికుల తరఫున పోరాడతామన్నారు. త్వరలో జిల్లాలో ఉన్న చేనేత కార్మికులంతా పార్టీ కోసం పనిచేసేలా చేనేత గ్రామాల్లో పర్యటించి సమన్వయం చేస్తానని తెలిపారు. అనుబంధ విభాగాల పదవుల కేటాయింపులో తాను జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి కారణమైన పార్టీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, కామిశెట్టి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి బాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా కాలభైరవ స్వామి తీర్థం


ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి


అన్న సమారాధనకు హాజరైన భక్తులు

- తరలి వచ్చిన భక్తజనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**తాళ్లరేవు:** కాలభైరవ స్వామి తీర్థ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కోరంగి పంచాయతీ సీతారామపురంలో సుబ్బారాయుడు దిమ్మ వద్ద వేంచేసి యున్న కాలభైరవస్వామి వారికి తెల్లవారు జాము నుంచి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పూలతో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. ఏడు గ్రామాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తీర్థ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కోలసంబరాలు, అప్పన్నెద్దుల విన్యాసాలు, గారడీ నృత్యాలతో తీర్థమహోత్సవం ఘనంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

## క్లుప్తంగా

### భూ వివాదంలో వ్యక్తిపై దాడి

**ముమ్మిడివరం:** భూ వివాదంలో ఓ వ్యక్తిపై మరో ఇద్దరు వ్యక్తులు దాడిచేసి గాయ పరిచారు. దీనికి సంబంధించి ముమ్మిడివరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముమ్మిడివరం మండలం అయినాపురంలో కొటిపల్లి నవీన్, బొర్రా సత్య సోమేశ్వరరావు, బొర్రా కృష్ణారావుల మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కోటిపల్లి నవీన్‌పై బొర్రా సత్య సోమేశ్వరరావు, కృష్ణారావులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో నవీన్ గాయపడి ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ దాడికి ఓ న్యాయవాది ప్రోత్స హించడంతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు, న్యాయవాదిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

### నేత్రానందంగా ఆలయ విగ్రహ ప్రతిష్ఠ


దేవతామూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

**ముమ్మిడివరం:** క్రాప చింతలపూడిలోని ఉమా వల్లభేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు ఎలమంచిలి కృష్ణమూర్తి శివాచార్యుల ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా ప్రతిష్ఠా మహోత్సవాలు జరిగాయి. ప్రముఖ వైద్యులు నేమాని జగన్మోహన్ సమకూర్చిన నిధులతో పాటు దేవదాయ శాఖ, గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

### వాగ్దేవి పాఠశాలకు గురుబ్రహ్మ అవార్డు

**అమలాపురం టౌన్:** స్థానిక వాగ్దేవి పాఠశాలకు సుచిరిండియా ఫౌండేషన్ గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల ఆ ఫౌండేషన్ నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో స్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లు సాధించిండచమే కాక పలు పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటుతున్నందుకు స్కూలును గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక చేసినట్లు సుచిరిండియా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 16న హైదరాబాద్ లలిత కళా తోరణంతో సుచిరిండియా నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ సభలో స్కూలు డైరెక్టర్ పరసా భరత్ అవార్డు అందుకోనున్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**అమలాపురం రూరల్:** ఈదరపల్లి బొంతువారి పేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన ఐదు కుటుంబాలకు అమలాపురం లయన్స్‌క్లబ్ వశిష్ఠ అధ్యక్షురాలు పోలిశెట్టి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ జీవీఎస్ మల్లిబాబు, క్లబ్ కార్యదర్శి చిక్కాల అరుణ, ఎం పూర్ణిమ, దేశారాజు పద్మప్రసాద్, జిల్లెళ్ల పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

### శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

**ఉప్పలగుప్తం:** మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వర ఆలయ సన్నిధానంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాల పనులను నిర్వాహక కమిటీ సభ్యులు శనివారం ప్రారంభించారు. పందిరి రాటకు ముహూర్తం చేసి, గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 24 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఉత్సవాలు జరిపే విధంగా నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అరిగెల నానాజీ, చీకట్ల ఏసుబాబు, గనిశెట్టి తాతాజీ, సలాది రాంబాబు, సలాది బ్రహ్మాజీ, అడబాల సత్యనారాయణ, వాలా సత్తిబాబు, మంచెం బాబీ, పేరాబత్తుల శ్రీను, గనిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

### 14న ఎంపీ వైథిలింగం యానాం రాక

**యానాం:** పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యులు వి వైథిలింగం ఈనెల 14న యానాం వస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్ శనివారం తెలిపారు. ఆయన వెంట మాజీ సీఎం నారాయణసామి, కందసామి, వైద్యనాథన్, పెరుమాళ్, అనంతరామన్, కార్తీక్ తదితరులు వస్తున్నారన్నారు.

### బూరుగులమ్మ కాంప్లెక్స్ ప్రారంభం

**అమలాపురం రూరల్ :** ఎ.వేమవరం గ్రామంలో బూరుగులమ్మ, ఆదిలక్ష్మి, పట్టాభి సీతారామ స్వామివార్ల ఆలయాల పోషణ నిమిత్తం గ్రామానికి చెందిన దాత సత్యనారాయణ బూరుగులమ్మ పేరుతో 14 షాపులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ప్రత్యేక పూజలు చేసి శనివారం ఈ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.

## దర్జీల ఫెడరేషన్ ఏర్పాటుకు వినతి


ఎమ్మెల్యే ఆనందరావుకు వినతి పత్రం అందించిన దర్జీల సంఘం ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** ప్రభుత్వం దర్జీలకు గుర్తింపునిచ్చి రాష్ట్ర స్థాయి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా దర్జీల సంఘం ప్రతినిధుల బృందం స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు శనివారం వినతి పత్రం అందించారు. గతంలో కేవలం జీవోగా ఉన్న రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్‌ను ఇప్పుడు అమలులోకి తీసుకుని రావాలని కోరారు. రాష్ట్రంలో ప్రైమరీ టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి ఫెడరేషన్ ఏర్పాటుకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో కూడిన మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దర్జీల జిల్లా సంఘం అధ్యక్షుడు జక్కంశెట్టి స్వామి, ప్రధాన కార్యదర్శి దొంగ సత్యనారాయణ మూర్తి, గౌరవాధ్యక్షుడు జక్కంపూడి సత్యనారాయణ, సంఘ ప్రతినిధులు రౌతు శ్రీను, బూర సతీష్, విప్పర్తి రాము, పితాని రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, కడలి సాయిబాబు తదితరులు ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

## బీజేపీ నేతల సంబరాలు


అమలాపురంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

**అమలాపురం రూరల్:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా అమలాపురం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ వద్ద జిల్లా బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు స్వీట్లు పంచిపెట్టారు. బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్‌లు మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు అవినీతిలో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పాలనకు చమరగీతం పాడారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, మోకావెంకట సుబ్బారావు, రాష్ట్ర బిల్డింగ్ వర్కర్ల కన్వీనర్ ఆకుల వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యల బాషా, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు గోకరకొండ గంగన్న స్వామి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వేగి వెంకటేశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పసుపులేటి మహాలక్ష్మి, రూరల్ యువమోర్చా అధ్యక్షుడు బొంతు శివాజీ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలకమర్తి కస్తూరీ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ విజయోత్సవ సంబరాలు**

**యానాం:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినందుకు శనివారం యానాం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు కనకాల రామదాసు, కనకాల రాజు తదితరులు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ విజయం సాధించడం అపూర్వ ఘట్టమని పేర్కొన్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.

## గోవిందా.. భక్త రక్షకా..


విలసవిల్లిలో రుక్మిణీ కల్యాణంలో పాల్గొన్న భక్తులు


తాళ్లరేవులో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**అమలాపురం టౌన్:** భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు శనివారం పోటెత్తారు. భీష్మ ఏకాదశి కావడం, స్వామికి ప్రీతి పాత్రమైన శనివారం కావడంతో స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చక స్వాములు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు గావించారు. భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు.

**సర్వ మంగళ రామలింగేశ్వరస్వామి కల్యాణం**

**అమలాపురం టౌన్:** స్థానిక రవణం వీధిలోని శివాలయం రోడ్డులో వేంచేసి యున్న సర్వ మంగళ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం శనివారం ఉదయం వైభవంగా జరిగింది. భీష్మ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం స్వామి కల్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవికుమార్ తెలిపారు. గ్రామోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాచిరాజు రవికుమార్, నాగవల్లి దంపతులు కర్తలుగా సాగిన స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని భక్తులు తిలకించి తరించారు.

**వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం**

**తాళ్లరేవు:** కోరంగి గ్రామంలో వేంచేసి యున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా రాత్రి ఏడు గంటలకు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. 10వ తేదీ రాత్రి ఏడు గంటలకు సదస్యం, 12వ తేదీ ఉదయం 8 గంటలకు చక్రస్నానం, 13వ తేదీ రాత్రి 7 గంటలకు పుష్పోత్సవం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వేణుగోపాల్ తెలిపారు.

**ఘనంగా రుక్మిణీ కల్యాణం**

**ఉప్పలగుప్తం:** మండలంలోని విలసవిల్లి గ్రామంలోని రామ మందిరంలో నిర్వహిస్తున్న నక్షత్ర నవగ్రహ పూర్వక మహా సౌరయాగంలో భాగంగా భీష్మ ఏకాదశి సందర్భంగా పదో రోజు రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం**

**తాళ్లరేవు:** భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక బాలాజీనగర్‌లో వేంచేసి యున్న అలమేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కందికొండ వెంకట కృష్ణయ్య పర్యవేక్షణలో అర్చకులు కొండవీటి సాయి బుచ్చిరామయ్య ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు


కోరింగా ఫార్మసీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అపోలో ఫార్మసీ ప్రతినిధులు

**తాళ్లరేవు:** కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శనివారం అపోలో ఫార్మసీ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల సెమినార్ హాలులో అపోలో ఫార్మసీ రీజినల్ హెడ్ డేవిడ్‌రాజు దేవ, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేష్‌లు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని, వీరిలో 30 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దున్నా జనార్ధనరావు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రవిప్రకాష్ డేగల, ఏఓ కొమ్మూరి మాల తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి చిత్రానికి గుర్తింపు


మధు గీసిన చిత్రం


మధును సన్మానించిన నిర్వాహకులు

**మలికిపురం:** ఈనెల 7, 8, 9 తేదీన హైదరాబాద్ జేఎన్టీయూలో క్రియేటివిటీ ఆర్ట్స్ అకాడమీలో నిర్వహించిన మాస్టర్ స్ట్రోక్ 4 లో 50 మంది చిత్రకారులతో ఒక ఆర్ట్స్ షోను నిర్వహించారు. అందులో సఖినేటిపల్లి మండలం మోరి గ్రామానికి చెందిన గంటా మధు చిత్రించిన చిత్రం మన పల్లెటూరు గ్రామాల్లో ఉండే అందమైన ప్రకృతిని అద్భుతంగా చిత్రించారు. ఇది హైదరాబాద్‌లో జేఎన్టీయూ యూనివర్సిటీ ప్రదర్శనలో జనాదరణ పొందింది. కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రొఫెసర్లు, నిర్వాహకులు పాల్గొని చిత్రకారుడు మధును సన్మానించారు.

### భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం

**తాళ్లరేవు:** ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భవన నిర్మాణ కార్మికుడికి తాళ్లరేవు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆర్థిక సాయం అందించి చేయూతగా నిలిచింది. తాళ్లరేవుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు సురేష్ ఇటీవల ఇంజరం రెడ్డి వారిపాలెం గ్రామంలో భవన నిర్మాణ పని చేస్తుండగా రెండవ అంతస్తు నుంచి కళ్లు తిరిగి కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో సురేష్ వెన్నుముకకు గాయం కావడంతో ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న సురేష్‌కు భవన నిర్మాణ సంఘం నాయకులు బొంతు శ్రీనివాస్, అత్తిలి గణేష్, పోతుల రాజు, పెంకే శ్రీనివాస్ తదితరులు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

### తాగునీటి సంపునకు శంకుస్థాపన

**ఉప్పలగుప్తం:** గ్రామ పంచాయతీ పరిధి కామరాజుపేటలో తాగునీటిని అందించే నూతన సంపు నిర్మాణ పనులకు సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు శ్రీకారం చుట్టారు. శనివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఓహెచ్‌ఆర్ ఎత్తు ఎక్కువగా ఉండటంతో గ్రామ ప్రజలకు తాగునీటిని అందుకోవడంలో పడుతున్న ఇబ్బందుల రీత్యా నూతన సంపు నిర్మాణానికి చర్యలు చేపట్టామని సర్పంచ్ చిన్నవరాజు తెలిపారు.

### సకాలంలో వైద్యం.. నిలిచిన ప్రాణం

**అమలాపురం రూరల్:** మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతు కరాటం దొరబాబుకు చెందిన ఆవుదూడ గత ఐదు రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఈ విషయాన్ని మండల పశు వైద్యులు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో అల్లవరం సీనియర్ పశు వైద్యుడు నారాయణరావు, బండారులంక వైద్యురాలు మాధురి ఆవుదూడకు సర్జరీ చేసి లోపల వ్యర్థాలను బయటకు తీసి ఆవు దూడ ప్రాణాన్ని కాపాడారు.

## అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోండి


డీఐజీ సత్యసుందరానికి సమస్యను వివరిస్తున్న గ్రామపెద్ద


డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ప్రారంభిస్తున్న డీఐజీ సత్యసుందరం

**డీఐజీకి ప్రజల నుంచి ఫిర్యాదులు**

**యానాం:** తీర గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతంలో విచ్చలవిడిగా సాగుతున్న పేకాట, గంజాయి వంటి అసాంఘిక కార్యకలపాలను అరికట్టేవిధంగా పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు పుదుచ్చేరి డీఐజీ ఆర్ సత్యసుందరానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజా ఫిర్యాదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ గ్రామాల ప్రముఖులు, పెద్దల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సావిత్రీనగర్ గ్రామానికి చెందిన మల్లాడి బీరాస్వామి మాట్లాడుతూ తమ గ్రామంలో విచ్చలవిడిగా పేకాట, గంజాయి, క్వాయిన్ ఆటలు ఆడుతున్నారని వీటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ యాక్టివిస్టు మండపాక సత్తిబాబు మాట్లాడుతూ పలు లాడ్జిల్లో పేకాట ఆడుతున్నారని, విచ్చలవిడిగా గంజాయి దొరుకుతుందన్నారు. ఏపీకి మద్యం, పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా జరుగుతుందని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కనకాలపేటకు వెళ్లే దారిలో చేపల వ్యాపారాలు నడుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కనకాలపేట పుష్కరఘాట్ వద్ద మద్యం సేవిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సైలు నూకరాజు, ఇలంగో తదితరులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత**

**యానాం:** మాదక ద్రవ్యాలను అరికట్టడం అందరి బాధ్యతగా గుర్తెరగాలని విద్యార్థులు, యువత వాటి జోలికి పోకుండా మంచి అలవాట్లు అలవర్చుకోవాలని పుదుచ్చేరి డీఐజీ ఆర్ సత్యసుందరం పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్‌ఏఓ కార్యాలయం వద్ద డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టిన మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా వ్యతిరేక ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చదువుపై అంతా దృష్టి సారించాలని మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలను గురించి వివరించారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని పట్టణ వీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రయాణాల్లో రక్షణ కవచంగా ఉంటుందని డీఐజీ సత్యసుందరం పేర్కొన్నారు. శనివారం ఆయన ఆర్‌ఏఓ కార్యాలయం వద్ద హెల్మెట్‌లు ధరించి పోలీసులు బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సైలు ఇలంగో, మురుగానందన్, శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.